క్లుప్తంగా

నేడు మంత్రి సురేష్ పర్యటన

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం యర్రగొండపాలెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సాయంత్రం 3 గంటలకు స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగే వైఎస్సార్ ఆసరా కార్యక్రమంలో పాల్గొని త్రిపురాంతకం, పుల్లలచెరువు, యర్రగొండపాలెం మండలాల మహిళా గ్రూపులకు చెక్కులు పంపిణీ చేస్తారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో నియోజకవర్గ స్థాయిలో జరిగే గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొంటారని మంత్రి కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దొనకొండ: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన బాలికలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేకాధికారి అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 27 తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వన్యప్రాణులకు పండ్లు, తాగునీరు సరఫరా

గిద్దలూరు రూరల్: మండలంలోని దిగువమెట్ట సమీప అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులకు ఎల్బీ బ్రాబ్ కాస్టింగ్ చైర్మన్ చీమలదిన్నె శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో గురువారం పండ్లు, తాగునీరు అందజేశారు. శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ వేసవి కాలంలో అటవీ ప్రాంతంలోని వన్యప్రాణులు దాహానికి, ఆకలికి ఇబ్బందులు పడకుండా నీటి తొట్లలో నీరు, అరటి పండ్లు ఉంచామని చెప్పారు. విలేజ్ ఫోర్స్ అధ్యక్షుడు శశికుమార్‌రెడ్డి, సభ్యులు రహిం, కృష్ణ కుమార్, నవీన్, లతీఫ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్య శిబిరం


వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారెడ్డి, మురారిని సన్మానిస్తున్న గోపాల్‌రెడ్డి

తర్లుపాడు: మార్కాపురంలోని బాలుర ప్రభుత్వ పాఠశాలలో విర్కో ఫౌండేషన్ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఏప్రిల్ 5న వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు డి. గోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని దివ్యాంగులను కలిసి శిబిరానికి రావాలని కోరారు. ప్రమాదాల్లో కాళ్ళు, చేతులు కోల్పోయిన వారు, పోలియో వలన దివ్యాంగులైన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి, కృత్రిమ పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డిని మండల పార్టీ అధ్యక్షులు మురారిని కలిసి వైద్య శిబిరం గురించి వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేసి గ్రామాల్లో ఉన్న దివ్యాంగులు అవకాశాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కాపురం, తర్లుపాడు, మండలాల అధ్యక్షులు ఎల్. శేఖర్, బైరెడ్డి వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

సత్తాచాటిన సానికవరం టీమ్


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న గ్రామస్తులు

పెద్దారవీడు: మండలంలో మద్దలకట్ట జెడ్పీహెచ్ పాఠశాలలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం గ్రామస్తులు ప్రారంభించారు. సానికవరం టీమ్, మార్కాపురం మండలం బిరుదలనర్వ టీమ్ పోటీపడ్డాయి. టాస్ గెలిచిన సానికవరం టీమ్ 12 ఓవర్లలో 92 పరుగులతో గెలిచింది. బిరుదలనర్వ టీమ్ 11.4 బంతుల్లో 89 పరుగులకు ఆలౌటైంది. అంపైర్లుగా జెడ్డా దానియోలు, జి. భరత్‌రెడ్డిలు వ్యవహరించారు. సర్పంచ్ గుంటు గాలెమ్మ, వైస్ సర్పంచ్ మద్దూరు దానియేలు, స్కూల్ చైర్మన్ మూల వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ మూల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ జెడ్డా లక్ష్మయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు మూల సత్యనారాయణరెడ్డి, ఏర్వ తిరుమలకొండారెడ్డి పాల్గొన్నారు.

5 నుంచి చలో ఢిల్లీ

మార్కాపురం టౌన్: కార్మికులు, రైతులు, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు, స్కీం వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. గురువారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికుల సమస్యల పట్ల మొండి వైఖరి అవలంబిస్తోందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలను పెంచాలన్నారు. వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంచాలని, పట్టణాల్లో కూడా అమలు చేయాలని కోరారు. సోమయ్య, సుబ్బారాయుడు, రూబెన్, బాలశేషయ్య, చెన్నకేశవులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


గిద్దలూరులో రాములవారి కల్యాణోత్సవం


మార్కాపురం: రామాలయంలో పూజలు చేస్తున్న జంకె


ముండ్లమూరు: పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి


వై.పాలెంలో..

మార్కాపురం: శ్రీరామనవమి పర్వదినాన్ని గురువారం భక్తులు వైభవంగా జరుపుకున్నారు. వాడవాడలా సీతరాముల కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించి కన్నులార తిలకించారు. మండలంలోని బొడిచెర్ల, బోడపాడు వివిధ గ్రామాలతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో జానకిరాముల కళ్యాణాన్ని వైభవంగా చేశారు. నాగులపుట్ట వీరాంజనేయ స్వామి, మెయిన్ బజార్‌లోని సీతరామచంద్ర స్వామి, పట్టాభిరామస్వామి, మార్కెట్ సెంటర్‌లోని రామాలయం, రజక వీధిలోని రామాలయాల్లో నవమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి కళ్యాణోత్సవానికి హాజరై పూజలు నిర్వహించారు. భక్తులకు పానకం, వడపప్పు పంచిపెట్టారు.

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలను ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. మాదాలవారాపాలం, మూగచింతల, ఈగలపాడు, గొల్లపల్లి కుంచేపల్లి, రామాపురం, గురుగుపాడు, జువ్వలేరు, మల్లవరం, ఆముదాలపల్లి, అన్న వరం, ఏలూరు, ఉప్పలపాడు, తలమళ్ళ గ్రామాల్లో పూజలు జరిగాయి. చలువ పందిళ్లు వేసి సీతారాముల కళ్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు.

అంతా రామమయం

దర్శి: అంతా రామమయం.. జగమంతా రామమయం..శ్రీరామ నవమి పండగ సందర్భంగా పట్టణం, గ్రామాల్లో రామ నామస్మరణతో మార్మోగింది. వీధి వీధినా చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్ కోదండరామాలయం, అద్దంకి రోడ్డు సీతారామాంజనేయ స్వామి ఆలయం, రామాలయం, ఆటోనగర్‌లోని రామాలయాల్లో ప్రధానంగా సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

బూచేపల్లి వెంకాయమ్మ ప్రత్యేక పూజలు

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ శ్రీరామ నవమి సందర్భంగా పట్టణంలోని కోదండ రామాలయం, ఆటోనగర్‌లోని సీతారాముల కల్యాణానికి హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి అక్కడ అన్నదానం ప్రారంభించారు.

మద్దిశెట్టి శ్రీధర్ ప్రత్యేక పూజలు

వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్ ఆలయాల్లో సీతారాముల కల్యాణం వేడుకలకు హాజరయ్యారు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

రామదండు ఆధ్వర్యంలో శోభయాత్ర

మార్కాపురం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని రామదండు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పట్టణంలో శ్రీరాముని శోభయాత్ర నిర్వహించారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయం దగ్గర నుంచి పట్టణమంత బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ఉన్న 9 శ్రీరామ ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు. కమిటీ సభ్యులు పి.ఎల్.పి యాదవ్, రంగస్వామి గౌడ్, డి. చంద్రశేఖర్, పి.వి కృష్ణారావు పాల్గొన్నారు.

పొదిలి: వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఆలయ తూర్పు గోపుర నిర్మాణ దాత వరికుంట్ల అనిల్, సురేఖ దంపతులు స్వామి వారి కళ్యాణం జరిపించారు. ఆలయ పూజారి మురళీచార్యులు ఆధ్వర్యంలో పూజలు, కళ్యాణం జరిగింది.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పెద్దదోర్నాలలో...

పెద్దదోర్నాల: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని వడ్డెర కాలనీ, ఐనముక్కల రామాలయాల్లో అర్చకులు ప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిపించారు. మండల కేంద్రంలో జరిగిన కల్యాణోత్సవంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అమిరెడ్డి రామిరెడ్డి, చిట్యాల యోగిరెడ్డి, చంద్రకాంత్‌నాయక్, గంటా గురవారెడ్డి, కర్రా మల్లారెడ్డి, తొమ్మంద్రు గాంధీ, వెన్నా వెంకిరెడ్డి, చల్లా వెంకటరెడ్డితో పాటు ముఖ్య నాయకులు, భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు. పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని పలు రాములవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల ముందు చలువ పందిళ్లు ఏర్పాటు చేసి భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయాల కమిటీలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. యర్రగొండపాలెం సీఐ మారుతీకృష్ణ, ఎస్ఐ శ్రీనివాసరావులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు: మండలంలోని భీమవరం శ్రీసీతాసమేత కోదండస్వామి విగ్రహ పునఃప్రతిష్ట మహోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు ఐక్యంగా ఆలయ నిర్మాణంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి శ్రీధర్‌లు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గురువారం ఉదయం నిత్యపూజావిధి, ఆలయప్రదిక్షణ, పూర్వక శిఖరకలశ విగ్రహప్రతిష్ట మహోత్సవం, పీఠన్యాసం, యంత్ర స్థాపన కార్యక్రమాలు నిర్వహించారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు: శ్రీరామనవమి పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మార్రెళ్ల, వేముల, ముండ్లమూరు, రమణారెడ్డిపాలెం, ఉల్లగల్లు, వేములబండ, శంకరాపురం, పోలవరం, కెల్లంపల్లి, రెడ్డినగర్ గ్రామాల్లోని రామాలయాల్లో సీతారామా కళ్యాణవేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు గ్రామస్తులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో సీతారాముల ఆలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు వడపప్పు, పానకం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.

గిద్దలూరు రూరల్‌లో...

గిద్దలూరు రూరల్: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల్లో కనుల పండువగా స్వామి వారి కల్యాణ మహోత్సవంతో పాటు పట్టాభిషేక మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో స్వామి వారి పట్టాభిషేకం అనంతరం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పాతబద్వేల్ రోడ్డులోని రామాలయం, పోలీసుస్టేషన్ రోడ్డులోని రామాలయాలల్లో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. రాచర్ల గేటు సెంటర్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, రేడియోబావి సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయం, కొత్తపల్లె గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదాలుగా పంపిణీ చేశారు.

బేస్తవారిపేటలో...

బేస్తవారిపేట: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలు కనుల పండువగా జరిపించారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై స్వామివారి ఊరేగింపు, రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజలు, అభిషేకాలు, పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజలు చేశారు. పాపాయిపల్లెలో చిన్నారులు, పెద్దలు వసంతోత్సవంలో పాల్గొని సందడి చేశారు.

కురిచేడులో..

కురిచేడు: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీసీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. చలువ పందిళ్లు వేసి స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ఉంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం నిర్వహించారు. కల్యాణాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం అన్నదానం చేశారు. భక్తులు ఎండలను సైతం లెక్క చేయకుండా స్వామివారి కల్యాణాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. మండలంలోని పొట్లపాడు కోదండరామాలయంలో నిర్వహించిన కల్యాణం అత్యంత రమణీయంగా జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారికి తలంబ్రాలు పోశారు. అప్పటి వరకు భక్తులు ఉపవాసదీక్ష చేసి స్వామివారి కల్యాణం అనంతరం భోజనాలు చేశారు.

పుల్లలచెరువులో..

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగానిర్వహించారు. పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పుల్లలచెరువు కోదండ రామస్వామి ఆలయంలో ఆలయ పూజారి అనంతాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఎదురుకోల నిర్వహించి అనంతరం కన్నుల పండువగా వేదమంత్రాల మధ్య రాములోరి కల్యాణం జరిపించారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు గ్రామాల్లో అన్నదానం చేశారు.

త్రిపురాంతకంలో...

త్రిపురాంతకం: శ్రీరామనవమి పండగను గ్రామ గ్రామాన వైభవంగా నిర్వహించారు. పండగ సందర్భంగా రామాలయాలు, హనుమాన్ ఆలయాల ముందు పందిళ్లు వేసి శ్రీసీతారామ కల్యాణాన్ని భక్తులు వైభవంగా జరిపించారు. త్రిపురాంతకంతో పాటు గ్రామాల్లో శ్రీసీతారామ కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజలు అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. నవమి సందర్భంగా తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

యర్రగొండపాలెంలో...

యర్రగొండపాలెం: శ్రీరామ నవమి సందర్భంగా గురువారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో చలువ పందిళ్లు వేసి భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, ఆదర్శ విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, ఎస్ఐ జి.కోటయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి స్వాములవారి కల్యాణంలో పాల్గొన్నారు.

కంభంలో...

కంభం: శ్రీరామనవమి వేడుకలు గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురాతన రామాలయం, కందులాపురం పంచాయతీ పరిధిలోని రామాలయం, లింగోజిపల్లిలో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణంలో భక్తులు సతీసమేతంగా పాల్గొన్నారు. గ్రామాల్లో పండగను పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కొమరోలులో..

కొమరోలు: శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని మండలంలోని రామాలయాల్లో వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పలు రామాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. దేవాలయాల్లో పానకం, వడపప్పు దేవతామూర్తులకు నైవేద్యంగా పెట్టి ప్రసాదంగా భక్తులకు పంచి పెట్టారు.

దొనకొండలో...

దొనకొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శ్రీరామ నవమి వేడుకలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామస్తులు, యువకులు ఆలయాల్లో వడపప్పు, పానకం పంచి పెట్టారు. ఆయా గ్రామాల్లోని పూజారులు రైతులకు పంచాంగం, పేరు బలాలు చెప్పారు. ఈ ఏడాది మంచిగా వర్షాలు పడాలి, పంటలు పండాలి, పిల్లా పాపలు సుఖ సంతోషాలతో జీవించాలని వేడుకున్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు: శ్రీరామనవమి వేడుకలు మండలంలో గురువారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆలయాల ఎదుట చలువ పందిళ్లు వేశారు. పానకం, వడపప్పు పంచిపెట్టారు. తూర్పుగంగవరం కొదండ రామరామస్వామి దేవాలయం, తాళ్లూరు, సుంకిరెడ్డిపాలెం, బొద్దికూరపాడు, విఠలాపురం, కొత్తపాలెం, నాగంబొట్లపాలెం, లక్కవరం, బొద్దికూరపాడు, దారంవారిపాలెం, తురకపాలెం, శివరామపురం, రజానగరం, కొర్రపాటివారిపాలెం, రమణాలవారిపాలెం, మన్నేపల్లి, దోసకాయలపాడు, తోటవెంగన్నపాలెం, వెలుగువారిపాలెం తదితర గ్రామాల్లో ఉభయ దాతలు ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దారవీడులో...

పెద్దారవీడు: శ్రీరామనవమి వేడుకలు పెద్దారవీడు, గొబ్బూరు, బి.చెర్లోపల్లె, సానికవరం తదితర గ్రామాల్లోని రామాలయాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దారవీడు, గొబ్బూరు గ్రామాల్లో అర్చకులు మేడవరం రాఘవేంద్ర, బాచిమంచి బరద్వాజ ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణం విశిష్టత గురించి వివరంగా భక్తులకు తెలియజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను మేళతాళాలతో గ్రామోత్సవం చేశారు.

కొనకనమిట్లలో...

కొనకనమిట్ల: శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవాలు గురువారం వాడవాడలా కనుల పండువగా నిర్వహించారు. గొట్లగట్టు రామాలయంలో వేదపండితులు వినుపాముల రామకృష్ణశర్మ కల్యాణం జరిపారు. గొట్లగట్టులో స్వామివారి కల్యాణం అనంతరం రైతులు పానకం బండ్లు కట్టి ఊరేగింపు నిర్వహించారు. వడపప్పు, పానకంలను భక్తులకు పంచిపెట్టారు.

తర్లుపాడులో...

తర్లుపాడు: మండల కేంద్రంలోని శ్రీపట్టాభి సీతరాముల ఆలయం, యాదవ బజారులోని కోదండ రాములవారి ఆలయం, ముదిరాజ్ వీధిలోని రాములవారి ఆలయంలో వేడుకలను నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


పుల్లలచెరువులో..


దర్శి: పూజలకు హాజరైన మద్దిశెట్టి శ్రీధర్


కంభం: కందులాపురంలో..


పొదిలిలో..

మా నమ్మకం నువ్వే జగనన్న

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు జగనన్న గృహసారథులు ఏప్రిల్ 1 నుంచి జరిగే మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొనాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం క్యాంప్ కార్యాలయంలో పార్టీ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 1 నుంచి 5వరకు ప్రతి బ్లాక్‌లో కౌన్సిలర్లు, గృహసారథులు సమావేశాలు పెట్టాలని 7 నుంచి 14 వరకు ప్రతి గృహాన్ని సందర్శించాలన్నారు. పార్టీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని పార్టీలతో సంబంధం లేకుండా పథకాలను అమలు చేస్తున్న విషయాలను గృహసారథులు వివరించాలన్నారు. చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, డాక్టర్ కనకదుర్గ, పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తిరవిచంద్ర, కౌన్సిలర్లు సిరాజ్, ఉత్తమ్ కుమార్, కరీం భాషా, కాశ్ళ ఆది, రహంతుల్లా, దొడ్డా భాగ్యలక్ష్మి, గుంటక చెన్నారెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శంకుస్థాపన

మార్కాపురం మండలం రాయవరం గ్రామంలో జేజేయం పథకం కింద 49.49 లక్షలతో నిర్మించిన ఓహెచ్‌యస్ఆర్‌కు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు కార్యాలయ ప్రతినిధి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. అనంతరం 11 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా తర్లుపాడు మండలంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు హాజరయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.


మార్కాపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ


ఎమ్మెల్యే కేపీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

మార్కాపురం టౌన్: వేసివిని దృష్టిలో పెట్టుకొని చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలో గాంధీ పార్కు దగ్గర రెడ్డి సంక్షేమ సేవాసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. వివిధ పనుల నిమిత్తం వచ్చేవారి కోసం చలివేంద్రాలు దప్పిక తీరుస్తాయన్నారు. సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంక్షేమ సంఘం అధ్యక్షులు గుంటక సుబ్బారెడ్డిని, సంఘ సభ్యులను అభినందించారు. పార్టీ కౌన్సిలర్ డాక్టర్ సి.హెచ్ కనకదుర్గ, దండా వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

జగ్జీవన్ రాం విగ్రహాన్ని ఏర్పాటు చేయండి


దేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి స్థలం కేటాయించి విగ్రహం ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులతో పాటు దళిత సంఘాల నాయకులు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి గురువారం సాయంత్రం వినతి పత్రం ఇచ్చారు. డి. బాబి, ఉత్తమ్‌కుమార్, కాశీరావు, సుస్మిత భూషణకుమారి, సంజీవ్, ప్రభాకర్‌రావు, ముసలయ్య, ప్రేమ్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణకు వినతి పత్రం అందించారు.

రాములోరి కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే అన్నా


ఎమ్మెల్యే అన్నాను సత్కరిస్తున్న నాయకులు

రాచర్ల: మండలంలోని చినగానిపల్లె కోదండ రామస్వామి కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తొలుత కోదండ రామస్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ సమీపంలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పందేలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయనకు జెడ్పీటీసీ పగడాల దేవి, చినగానిపల్లె సర్పంచ్ పగడాల రమేష్, మండల వైఎస్సార్ సీపీ నాయకుడు పగడాల శ్రీరంగం శాలువ కప్పి ఘన సన్మానం చేశారు. చోళ్లవీడు మాజీ సర్పంచ్ మధూసూదన్‌రావు, ఆకవీడు ఎంపీటీసీ నందం రవి పాల్గొన్నారు.

గ్రామీణుల అవసరాలు తీర్చే పనులు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కోట్ల, పక్కన డ్వామా పీడీ శీనారెడ్డి

త్రిపురాంతకం: గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ అవసరాలు, గ్రామీణ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన రోడ్లు, నీటి నిల్వలు పెంచేందుకు దోహదపడే పనులు, వ్యవసాయానికి అవసరమైన పంటకాల్వలు వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనులు ఎక్కువగా చేపట్టాలని ఎంపీపీ సూచించారు. డ్వామా పీడీ శీనారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పనులు గుర్తించే సమయంలో అవసరమైన పనులు చేపట్టే విధంగా ప్రతిపాదనలు పంపాలన్నారు. పంట కాలువలకు అవకాశం ఉన్నందున గుర్తించి ముందుగా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమావేశంలో డీపీఓ వెంకట సుబ్బయ్య, అంబుడ్స్‌మెన్ మీరావలి, ఎంపీడీఓ మరియ దాస్, ఏపీఓ మోషే, ఎస్ఆర్‌పీ నీలకంఠం పాల్గొన్నారు.